క్లుప్తంగా

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న మానవత సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మనకున్నంతలో ఇతరులకు సహాయపడడం అనేది భగవంతుడు కల్పించిన వరమని పాలకొల్లు మండల శాఖ మానవత అధ్యక్షుడు మద్దాల వాసు అన్నారు. బుధవారం మండలంలోని వడ్లవానిపాలెం గ్రామానికి చెందిన సిద్దుల గాంధీ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న మానవత సంస్థ బాధితుడికి రూ.10,116లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చేగొండి జోగయ్య, పెన్మెత్స సాయిబాబా, బోళ్ల శ్రీనివాసరావు, రేకపల్లి లక్ష్మణ్, పి కేశవరాజు, పి.ఎస్ ప్రతాప్‌రాజు, జుత్తిగ నారాయణ, రామసూర్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలను అందిస్తున్న జయసరిత

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలోని పోడూరు మండలం అప్పనచెర్వు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, వార్డు సభ్యురాలు మల్లిపూడి శారమ్మ కుటుంబానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత నిత్యావసర సరుకులు అందించారు. ఇటీవల సారమ్మ కుమారుడు సూర్యతేజ మృతి చెందిన విషయం తెలుసుకుని సంతాపం వ్యక్తం చేసి బియ్యం బస్తాతో పాటు నిత్యావసరాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దపాటి పెద్దిరాజు, జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, రామంజుల చిన్నమదు, వీరా మల్లికార్జునుడు, బుంగా జయరాజు, నాగేశ్వరరావు, హైమావతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ గణపతి హోమం



లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతిహోమం నిర్వహించారు. ఈ హోమంలో 15 మంది దంపతులు పాల్గొన్నారు. ప్రతి నెలా సంకటహర చతుర్థి నాడు ఆలయంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ తెలిపారు. హోమం అనంతరం భక్తులను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

మాతృభాషను మరువద్దు



కొప్పర్తి రాంబాబును సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మాతృభాషను ఎప్పుడూ మరువద్దు అని విశ్రాంత ఉద్యోగి, తెలుగు పాఠ్యపుస్తక పరిష్కర్త కొప్పర్తి రాంబాబు పేర్కొన్నారు. కొప్పర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తెలుగు భాష ప్రాధాన్యత, తెలుగు భాషలో ప్రావీణ్యత అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భాష అనేది మన సంస్కృతి, భావాలను వ్యక్త పరిచే సాధనంగా వివరించారు. మాతృభాష విశిష్టతను వివరిస్తూ మాతృభాష బాగా వస్తే ఇతర భాషల్లోనూ నైపుణ్యం పెంచుకోవడం సులువు అవుతుందని విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రముఖులు కొప్పర్తిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చేమకూరి రాంబాబు, చినమిల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగం బలోపేతానికి పోరాటం

పాలకోడేరు: మండలంలోని శృంగవక్షం గ్రామ పంచాయతీ పరిధిలోని బంటుమిల్లిలో బుధవారం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం ఎంఈఓ నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విచ్చేసిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ శాసనమండలిలో ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడడానికి అవసరమైన పోరాటం చేస్తున్నానని దీనికి ప్రజల సహకారం ముఖ్యంగా తల్లిదండ్రుల మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల పనివిధానం, బోధనా పద్ధతుల గురించి ప్రధానోపాధ్యాయులు జీవీవీ రామానుజరావు తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగం సూరిబాబు, హెచ్‌ఎం తోట కాశీ జగన్నాథం, పీఎస్ విజయరామరాజు పాల్గొన్నారు.

మురుగు డ్రెయిన్లకు మోక్షమెప్పుడో?



వేంద్ర వారి వీధిలో పంటకాలువలోకి వెళ్తున్న మురుగు



పెనుగొండ కంబాల వారి వీధిలో పంటకాలువ దుస్థితి



పెనుగొండలో పంటకాలువలోకి చేరుతున్న మురుగు

పెనుగొండ: పెనుగొండలో మురుగు డ్రెయిన్లకు మోక్షమెప్పుడో? అంటూ ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారు. దశాబ్దాలుగా మురుగు సమస్య పెనుగొండ ప్రజలను వెంటాడుతుంది. మురుగు డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. మురుగు గ్రామ శివారున ఉన్న నక్కల డ్రెయిన్‌లోకి పోయే మార్గం లేక పంటకాలువల్లోకి చేరుతూ రైతులను ఇబ్బందులు పెడుతుంది. పెనుగొండకు ప్రధాన పంటకాలువలైన ఆచంట ఓల్డ్ చానల్, ఎల్లప్ప కాలువలు పెనుగొండలోని మురుగు డ్రెయిన్ల దెబ్బకు మురుకు కాలువల్లా మారిపోయాయి. మురుగు సమస్య పరిష్కారం కోసం గతంలో భూగర్భ డ్రెయినేజీకి ప్రతిపాదనలు చేశారు. అయితే నిధుల లభ్యత లేకపోవడంతో భూగర్భ డ్రెయినేజీ ప్రణాళిక కాస్తా అటకెక్కింది. పెనుగొండ మెయిన్ రోడ్డులోని మురుగు ఎల్లప్ప కాలువలోకి, ఇతర గ్రామంలోని మురుగునీరు పెనుగొండ దేవ రోడ్డులోని ఆచంట ఓల్డ్ చానల్‌లోకి చేరుతుంది. మురికి కూపంగా మారిన సాగునీరు వరిచేల్లోకి చేరి దిగుబడులపైనా ప్రభావం చూపుతుంది. చెరుకువాడలోని మురుగు ఇంటిగ్రేటెడ్ వసతి గృహం వద్దకు చేర్చి అక్కడ నుంచి నక్కల డ్రెయిన్‌కు చేర్చాలన్న ప్రతిపాదనలు సైతం ఆటకెక్కాయి. దీంతో ప్రాంతం అంతా మురుగు వాసనతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

పవన్ దత్తత కలిసొచ్చేనా..?

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ మూలాలు పెనుగొండలో ఉండడంతో పెనుగొండను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభకు మురుగు సమస్యను ప్రధానంగా ప్రజలు విన్నవించుకున్నారు. ప్రధాన సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసి తొలి సమస్యగా డ్రెయినేజీ వ్యవస్థనే బాగు చేయాలంటూ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు సైతం సాగునీటిని మురుగు నీటి నుంచి రక్షించాలంటూ కోరారు. దీంతో పరిష్కారం లభిస్తుందన్న ఆశతో పెనుగొండ గ్రామ ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెనుగొండ వేంద్రవారి పేట నుంచి నక్కల డ్రెయిన్ వరకూ డ్రెయినేజీ, అదేవిధంగా చెరుకువాడ నుంచి నక్కల డ్రెయిన్ వరకూ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టడం ద్వారా మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు సూచించారు. దీనికి అనుగుణంగా నిధులు మంజూరు చేయాలంటూ ప్రజలు కోరుతున్నారు.

నేడు గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సమావేశం

నరసాపురం రూరల్: విజయవాడలో ఈ నెల 27న జరుగనున్న ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమానికి ఆహ్వానం పలుకుతూ గురువారం సాయంత్రం నరసాపురం అల్లూరి సంస్కృతిక కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ రచయిత కొప్పర్తి రాంబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి గ్రంథాలయ పునర్వికాసం కోసం ఆహ్వానం పలుకుతూ నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా నరసాపురంలో నిర్వహించనున్న కార్యక్రమానికి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉద్యమ కన్వీనర్ వల్లూరి శివప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సాహిత్య అభిమానులు, రచయితలు అందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

జగనన్న కాలనీలో సమస్యల పరిశీలన



పెనుగొండ జగనన్న కాలనీల్లో సమస్యలు పరిశీలిస్తున్న అధికారులు

పెనుగొండ: మండలంలోని మునమర్రు రోడ్డులోని జగనన్న కాలనీల్లో సమస్యలను పరిష్కరించడం కోసం పరిశీలించినటు ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. బుధవారం మునమర్రు రోడ్డులోని రెండు లే అవుట్‌లను పరిశీలించారు. కాలనీల్లో రోడ్డు, తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించాలంటూ ఆయా ప్రాంతాల లబ్ధిదారులు పీజీఆర్ఎస్‌లో విన్నవించుకున్నారు. దీంతో సమస్యలు పరిశీలించి అంచనాలు తయారు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆయా ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

భీమవరం అర్బన్: సొంతిల్లు లేని పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. మండలంలోని తాడేరులోని సచివాలయం వద్ద బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వీఆర్‌వోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చి 11వ నెల గడుస్తున్నా ఆ ఊసేలేదన్నారు. కార్యక్రమంలో ఎం.సీతారామ్ ప్రసాద్, ఖాస్ భాషా, ఇళ్ల స్థలాల ఆర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నరసాపురం: అగ్నిప్రమాదాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నరసాపురం ఫైర్ ఆఫీసర్ కె.భాస్కర శ్రీరామ్ సూచించారు. బుధవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్స్‌లో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఎలా అదుపు చేయాలి? అనే అంశంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇళ్లలో వంట గ్యాస్ వినియోగం సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ఇంటిలో గానీ, హోటల్స్‌లో గానీ, ఎల్‌పీజీ గ్యాస్ వాడినప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వై.జానకిరామ్ అన్నారు. బుధవారం పట్టణంలోని తులసి అపార్ట్‌మెంట్, సాయి సూర్యరత్న అపార్ట్‌మెంట్, కొండాలమ్మ ఆలయం వద్ద ఉన్న అపార్ట్‌మెంట్‌లలో గృహిణులకు ఎల్‌పీజీ గ్యాస్ వాడకంపై అవగాహన కల్పించారు. ఎల్‌పీజీ గ్యాస్ లీకైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా వివరించారు.



నరసాపురం: వంట గ్యాస్ ప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



పాలకొల్లు సెంట్రల్: డెమో ద్వారా నిర్వాసితులకు జాగ్రత్తలు చెబుతున్న ఫైర్ సిబ్బంది

రూ.3.99 లక్షలకు దొడ్డిపట్ల ఫెర్రీ వేలం

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి దొడ్డిపట్ల ఫెర్రీ వేలం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.3,76,756 ధరకు వేలం ప్రారంభించగా దొడ్డిపట్ల గ్రామానికి చెందిన చేగొండి వాసుబాబు రూ.3.99 లక్షలకు పాట దక్కించుకున్నారు. ఫెర్రీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత, ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, కనకాయలంక సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్, దొడ్డిపట్ల గ్రామ కార్యదర్శి తోలేటి పార్వతి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ వేలం పై నివేదికను జిల్లా పరిషత్ సీఈఓకు పంపుతామని ఆయన నుంచి అనుమతి వచ్చిన తరువాత వేలం ఖరారు చేస్తామని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత తెలిపారు. పాట ఖరారైన తేదీ నుంచి 2026 మార్చి 31 వరకు ఈ వేలం అమలులో ఉంటుందని ఆమె వివరించారు.



దొడ్డిపట్ల ఫెర్రీ వేలం నిర్వహిస్తున్న ఫెర్రీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

తల్లుల చేతుల్లోనే పిల్లల ఆరోగ్యం

యలమంచిలి: తల్లుల చేతుల్లోనే పిల్లల ఆరోగ్యం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా చెప్పారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం చించినాడ గ్రామంలో పిల్లల బరువు చూసి, బరువు తక్కువ ఉన్న పిల్లల తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి పిల్లల ఆరోగ్యంగా బరువు పెరగాలంటే తీసుకోవాలని జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎం సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రజని, సుజాత, జ్యోతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి

పెనుగొండ: పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పెనుమంట్ర ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజరు రూతుకుమారి అన్నారు. బుధవారం పెనుగొండ మండలం చినమల్లం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్వాడాలో పాల్గొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. 1000 రోజుల సంరక్షణ, లోప పోషణ, రక్తహీనతలను వివరించారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటి పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



యలమంచిలి: చించినాడలో పిల్లల బరువు చూస్తున్న మహ్మద్ హసీనా



పెనుగొండ: చినమల్లంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

బెల్లం తయారీ కేంద్రంపై విజిలెన్స్ దాడులు

యలమంచిలి: మండలంలోని కంచుస్తంభంపాలెం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలోని బెల్లం తయారీ కేంద్రంపై బుధవారం విజిలెన్సు, ఆహార తనిఖీ అధికారులు సంయుక్తంగా దాడి చేశారు. బెల్లం తయారీ కేంద్రంలో కృత్రిమ రంగులు, రసాయనాలు కనిపించడంతో వాటిని సీజ్ చేశారు. బెల్లం తయారీలో అవి కలిపారా? లేదా? అని నిర్ధారించడానికి బెల్లం నమూనాలు సేకరించి, విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపారు. ఆ ప్రదేశమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో అపరిశుభ్ర వాతావరణంలో బెల్లం తయారు చేస్తున్నారనే కారణంతో ఆహార భద్రత చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. బెల్లం తయారీలో రంగులు, రసాయనాలు కలుపుతున్నందున క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో విజిలెన్సు ఎస్సైలు కె.సీతారామ్, కె.నాగరాజు ఆహార తనిఖీ అధికారి సుందర రామిరెడ్డి పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్సు, ఆహార తనిఖీ అధికారులు

తాటి ముంజలు వచ్చేశాయ్..!

- వేసవి తాపానికి ఉపశమనం
- ఆరోగ్యానికి మంచి ఔషధం
- గ్రామాల్లోనూ పెరుగుతున్న డిమాండ్

యలమంచిలి: ఒకవైపు మండే ఎండలు, మరొకవైపు తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో సీజనల్‌గా వచ్చే తాటి ముంజలు అందుబాటులోకి రావడంతో వీటిని తినడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి పండ్ల రసాలు, కర్బూజా కాయలతో పాటు తాటిముంజలపై కూడా ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఒకప్పుడు వేసవిలో గ్రామాలలో ఉండే బంధువుల ఇంటికే వెళితే వారి పొలాల నుంచి తాటి ముంజలు రప్పించి ఇచ్చేవారు. ఇప్పుడు గ్రామాలలో సైతం తాటి చెట్లు ఎక్కువగా లేకపోవడంతో తాటి ముంజలు కూడా కొనుక్కుని తినే వాటి జాబితాలో చేరిపోయాయి. తాటి ముంజల కొనుగోలుకు ప్రజలు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో విక్రయాలు జోరందుకుంటున్నాయి.

డజను రూ.100 వరకూ అమ్మకం

తాటిముంజలు డజను రూ.80 నుంచి 100 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. వేసవిలో దాహార్తిని తీర్చడంతోపాటు శరీరానికి చల్లదనాన్ని అందించడం, ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు మెండుగా ఉండడంతో తాటి ముంజలను ఐస్ యాపిల్ గా పిలుస్తారు. రోడ్డు పక్కన తాటి ముంజలను చూసిన వారు తప్పనిసరిగా కొనుక్కుని వెళుతున్నారు. తాడిచెట్ల సంఖ్య తగ్గిపోవడంతో వ్యాపారులు కోనసీమ జిల్లా నుంచి తాటికాయలను తీసుకువచ్చి ఇక్కడ ముంజలను విక్రయిస్తున్నారు. తాటి ముంజల్లో పోషకాలు, విటమిన్లు అధిక శాతంలో ఉంటాయని ఉండి కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యాన శాస్త్రవేత ఆర్.బిందుప్రవీణ తెలిపారు. వంద గ్రాముల తాటి ముంజల్లో 43 కేలరీల శక్తి ఉంటుందన్నారు. విటమిన్ ఏ,బీ,సీ సమృద్ధిగా ఉంటాయని ఆమె చెప్పారు. తాటి ముంజల్లో అధిక శాతం నీరు ఉండడం వల్ల వీటిని తింటే దాహార్తిని తీర్చడంతో పాటు శరీరానికి చల్లదనాన్ని ఇస్తుందన్నారు. ఐరన్, జింక్, పాస్పరస్, కాల్షియం వంటి పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. లేత తాటి ముంజలు తినాలని సూచించారు. లేత కొబ్బరిని పోలి ఉండడంతో ప్రతి ఒక్కరూ ఇష్టపడతారన్నారు.



తాటి ముంజలు చూపుతున్న వ్యాపారి, కొనుగోలుదారులు



దిగమర్రు బైపాస్‌లో తాటి ముంజలు విక్రయిస్తున్న మహిళ

నేడు చాంబర్ కళాశాలలో జాబ్‌మేళా

పాలకొల్లు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ శిక్షణ, ఉద్యోగ కల్పనా సంస్థ వికాస వారి సౌజన్యంతో 13 కంపెనీలతో స్థానిక చాంబర్ కళాశాలలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే జాబ్ మేళాలో ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌బీడీ, డెక్కన్ క్రానికల్, పానసోనిక్, ఇండో ఎంఐఎం, ఇసుజి, కాగ్నెంట్ వంటి బ్యాంకింగ్, ఐటీ, నాన్ ఐటీ సంస్థలకు చెందిన 470 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. వేతనం రూ.12,700 నుంచి 36,000 వరకూ ఉంటుందని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 99120 46234, 94935 03441 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

మండల సమావేశానికి అధికారుల గైర్హాజరు

ఉండి: ఎన్నిసార్లు హెచ్చరించినా ఉండి మండలంలో అధికారుల తీరు మారడం లేదు. ముఖ్యమైన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని అతి తేలిగ్గా తీసుకుని అసిస్టెంట్లను పంపుతున్నారు. ఉండిలో ఈ నిర్లక్ష్య అధికారానికి ప్రజా ప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారుల తీరులో మార్పు రాకపోవడంతో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు ఆరా తీశారు. బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశానికి 28 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా 11 మంది గైర్హాజరవడంతో 17 మంది అధికారులు మాత్రమే పాల్గొన్నారు. ఎక్కువ మంది అధికారులు ఏదో సాకులు చెప్పి సమావేశానికి దూరంగా ఉండి వారి అసిస్టెంట్లను లేదా కింది స్థాయి అధికారులను, సిబ్బందిలో ఎవరో ఒకరిని పంపించి మమ అనిపిస్తున్నారు. ఇంత దారుణంగా ఉన్న అధికారుల తీరుపై ఎంపీపీ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోకు తెలియజేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి, వైస్ ఎంపీపీ సుజాతరాణి, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఈవోపీఆర్డీ సీవీఎస్ రెడ్డి, పీవీఆర్‌కే ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆకివీడు: గ్రామాల్లో తాగునీటి చెరువుల్లో నీటిని పూర్తి స్థాయిలో నింపి వేసవి తాపం లేకుండా చూడాలని ఎంపీపీ కఠారి జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదన్నారు. ఎంపీడీఓ సుహాసిని మాట్లాడుతూ సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ జేఈ శ్రీహరి మాట్లాడుతూ పెదకాపవరం, క్రొవ్విడి రహదారుల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పాలకోడేరు: మండలంలో స్వయం ఉపాధి సోపానం 2024– 25 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ అభ్యర్థులకు ఆర్థిక సాయం అందిచేందుకు లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపీడీఓ వి.రెడ్డియ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు రకాల కేటగిరీల వారీగా ప్రభుత్వం రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. రూ.2.5 లక్షల నుంచి 2.9 లక్షల వరకు రుణాన్ని ఒక లక్ష సబ్సిడీతో, 5 శాతం వాటా లబ్ధిదారినితో, మిగిలిన మొత్తం బ్యాంకు రుణం అందిస్తున్నట్లు తెలిపారు. రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు 40 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ పథకాలకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా మే 10వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయం, లేదా మీసేవ, ఇంటర్నెట్ సెంటర్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి అభ్యర్థి రెండు సెట్ల దరఖాస్తులు ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ముఖ్యంగా పథకానికి అభ్యర్థి ఆధార్ కార్డు, రేషన్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత నకలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, రవాణా పథకాలకు అభ్యర్థి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, అభ్యర్థుల వయస్సు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు.

ఉచిత చదరంగం శిక్షణ ప్రారంభం

కాళ్ల: మండలంలోని సీసలి జిల్లా పరిషత్ హైస్కూలులో చదరంగం ఆటపై ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభించారు. చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట హరిబాబు మాట్లాడుతూ 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. అనంతరం చదరంగం ఆటపై ఉచిత శిక్షణ మెటీరియల్ విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.